సాక్షి
కర్నూలు
ఆదివారం, 1 అక్టోబర్, 2023



రూ.6.13 లక్షల ఆదాయం

బేతంచెర్ల: ఆర్.ఎస్. రంగాపురం సమీపంలో వెలసిన శ్రీ మద్దిలేయ్య క్షేత్రానికి శనివారం ఒక్క రోజు వివిధ సేవల ద్వారా రూ. 6,13,907 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



వృద్ధాప్యంలో ఆదరణ

వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోంది. వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడంతోపాటు అవసరమైన వైద్య పరీక్షలు చేయిస్తూ మందులు ఉచితంగా అందజేస్తోంది. 8లో▸



14,15 తేదీల్లో ఎస్‌ఐ 'మెయిన్స్'

ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షను ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నారు. రాయలసీమ జోన్‌కు సంబంధించి మెయిన్స్‌కు 8,347 మంది అర్హత సాధించారు. 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల పండుగ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును శనివారం బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారు. ప్రతి నెల 1వ తేదీ వస్తుందంటే అవ్వతాతలు, వికలాంగులు ఇతర అన్ని వర్గాల వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఆదివారం ఉదయం నుంచే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామ, వార్డు వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు పింఛన్ల పంపిణీకి రూ.130,36,34,750 విడుదల చేసిన విషయం తెలిసిందే. పంపిణీ కార్యాక్రమాన్ని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల, అదనపు పీడీ షరీఫ్ పర్యవేక్షిస్తారు. 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేస్తారు.

పీఎస్‌ల హేతుబద్ధీకరణ గడువు 9 వరకు పొడిగింపు

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ స్టేషన్ల(పీఎస్‌ల) హేతుబద్ధీకరణకు ఈనెల 9వ తేదీ గడువు పెంచినట్లు డీఆర్వో కె.మధుసూదనరావు చెప్పారు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 29వ తేదీలోపు ఈ ప్రక్రియ ముగియాల్సి ఉందన్నారు. అయితే ఎన్నికల కమిషన్ గడువును పెంచుతూ తాజాగా ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన వివరించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా రెవెన్యూ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముసాయిదా ఓటరు జాబితా విడుదల గడువును ఈనెల 17 నుంచి అక్టోబర్ 27వ తేదీ వరకు పెంచామన్నారు. తుది ఓటరు జాబితాను 2024 జనవరి 5వ తేదీన విడుదల చేస్తున్నామన్నారు. ఇందుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.

15 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 15 మండలాల్లో వర్షం కురిసింది. హాలహర్విలో 36.6, పత్తికొండలో 24.2, వెల్దుర్తిలో 23.0, కోడుమూరులో 15.2, ఆలూరులో 15.2, కృష్ణగిరిలో 13.8, గూడూరులో 11.2, ఆస్పరిలో 11.2 మి.మీ. ప్రకారం వర్షం కురిసింది. జిల్లా మొత్తంగా సగటున 6.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. సెప్టెంబరు నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ. ఉండగా ఇప్పటి వరకు 104.8 మి.మీ. వర్షం కురిసింది.

జిల్లాకు 7,020 బ్యాలెట్ యూనిట్లు

కర్నూలు(సెంట్రల్): జిల్లాకు 7,020 బ్యాలెట్ యూనిట్లు, 5,460 కంట్రోల్ యూనిట్లు రానున్నాయని, వాటిని పటిష్ట భద్రత నడుమ దాచి పెట్టాలని సిబ్బందిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును శనివారం ఆమె తనిఖీ చేశారు. బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఐదుగురు ఇంజినీర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న వీవీప్యాట్ల పనితీరును ఆమె స్వయంగా పరిశీలించారు. ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ నోడల్ అధికారి, డీపీఓ నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

ఊరూవాడా స్పెషల్ వైద్యం



- మొదటి రోజు 27 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- హాజరైన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు
- ప్రతి శిబిరంలో 500 మందికిపైగా చికిత్స



కర్నూలులో వైద్యపరీక్షల కోసం భారీగా తరలివచ్చిన జనం

కర్నూలు(హాస్పిటల్): ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేరుతో ఊరూవాడా వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. తొలి రోజు శనివారం ప్రతి మండలంలో ఒక గ్రామంతో పాటు పట్టణాల్లోని యుపీహెచ్‌సీలో క్యాంపులు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యశిబిరం గురించి ప్రజలకు ముందుగానే చెప్పినందున టోకెన్‌లు తీసుకున్న వారు ఆయా శిబిరాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరికి ప్రతి శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టులు, ఇద్దరు ఎంబీబీఎస్ స్థాయి వైద్యులు చికిత్స అందించారు. స్పెషలిస్టులలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, పెథాలజీ తదితర విభాగాల వైద్యులు ఉన్నారు. వీరిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఎమ్మిగనూరు, ఆదోని ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల నుంచి ప్రత్యేకంగా పిలిపించారు. సగటున ప్రతి క్యాంపులో ఓపీకి 500 మంది దాకా ప్రజలు చికిత్స కోసం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయా వైద్యశిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. హెల్ప్‌డెస్క్, కేస్‌షీట్‌ల పంపిణీ, ల్యాబ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ కౌంటర్లు, మందులు ఇచ్చే కేంద్రాలు, స్పాట్ సర్వే కౌంటర్, తాగునీటి ఏర్పాట్లను తనిఖీ చేశారు.

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య గార్గేయపురంతో పాటు నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను తనిఖీ చేశారు. నాగలాపురంలో 401 మంది ఓపీ చికిత్సకు వచ్చినట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఇందులో 24 మంది గర్భిణులు ఉన్నారు. 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 28 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 11 మంది పాఠశాల విద్యార్థులను సైతం పరీక్షించారు. పోషకాహారలోపంతో ఉన్న 12 మంది పిల్లలకు చికిత్స చేశారు. 401 మందిలో 11 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు.
- కర్నూలు నగరంలోని పెద్దమార్కెట్ సమీపంలోని ఉర్దూఘర్ వద్ద ఉన్న యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ సందర్శించారు. కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మందులు, చికిత్స అందే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.
- ఆదోని మండలం ఇస్వీ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొని ప్రసంగించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.
- కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామం, తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొన్నారు. అక్కడి కార్యక్రమంలో మాట్లాడిన అనంతరం వైద్యశిబిరంలో ఏర్పాట్లను పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు రానీయకూడదని చెప్పారు.
- ఎమ్మిగనూరులోని శిల్పా ఎస్టేట్‌లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో వైఎస్ఆర్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.
- కె. నాగలాపురం, పోలకల్, కోడుమూరులలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ ప్రసంగించారు. శిబిరానికి వచ్చిన రోగులను ఆయన స్వయంగా పరీక్షించి సూచనలు, సలహాలు అందజేశారు. వైద్యశిబిరాన్ని స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు.
- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ కృష్ణగిరి పీహెచ్‌సీ పరిధిలోని అమకతాడు, చిప్పగిరి పీహెచ్‌సీ పరిధిలోని బెల్లడోణ, ములగవల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఆలూరు, ఆస్పరి పీహెచ్‌సీ పరిధిలోని ఆస్పరి, లద్దగిరి పీహెచ్‌సీ పరిధిలోని కోడుమూరు గ్రామాల్లో వైద్యశిబిరాలను తనిఖీ చేశారు.



కృష్ణగిరి మండలం అమకతాడులో ఓపీ చూస్తున్న వైద్యురాలు



పరీక్ష కోసం రక్తాన్ని సేకరిస్తున్న నర్సు



చిన్నారికి టీకా వేస్తున్న దృశ్యం



కంటి పరీక్షలు చేస్తూ..



ఉచితంగా మందులు అందజేస్తూ..



సీ బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో బీపీ పరీక్ష చేసి వివరాలు నమోదు చేస్తూ..



బీపీ చూసుకుంటున్న మంత్రి గుమ్మనూరు జయరాం

అందరికీ ఆరోగ్యమే ధ్యేయం

ఆస్పరి: అందరికీ ఆరోగ్యం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శనివారం ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాలను పరిశీలిస్తూ డాక్టర్లు, రోగులతో మాట్లాడారు. వైద్య శిబిరంలోనే మంత్రి బీపీ చూసుకున్నారు. అనంతరం సర్పంచ్ మూలింటి రాధమ్మ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ మంచి చేసే జగనన్నకు అండగా ఉండాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు తన 40 ఏళ్ల రాజకీయంలో ప్రజలకు ఏమి చేశారో చెప్పాలన్నారు. రెండు ఎకరాలు ఉన్న చంద్రబాబుకు రూ. 2లక్షల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. జన సేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్.. ప్రజల కోసం పని చేస్తున్నారో, చంద్రబాబు నాయుడు కోసం పనిచేస్తున్నారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సొసైటీ సీఈఓ అశోక్, వ్యవసాయ మండలి మండల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకర రామాంజినేయులు, రాంభీమ్‌నాయుడు, పెద్దయ్య, ఉమ్ముంబా, ప్రకాష్, తిమ్మప్ప, శివ, లక్ష్మన్న పాల్గొన్నారు.



మంచి కార్యక్రమం

నాకు కంటి చూపు సరిగ్గా లేదు. బీపీ, షుగర్ కూడా ఉంది. పట్టణానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోలేని పరిస్థితి నాది. మా ఊరికి వైద్యులందరూ వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఇది మంచి కార్యక్రమం. పేదలకు చాలా ఉపయోగపడుతుంది.

– షేక్ సాహెబ్, ఆస్పరి



చాలా సంతోషం

నా వయస్సు 60 సంవత్సరాలు. మా ఇంటి సమీపంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో అక్కడి వెళ్లాను. రూపాయి ఖర్చు లేకుండా బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– మహబూబ్‌బీ , ఖందేరి వీధి, కర్నూలు



పేదలకు ఎంతో మేలు

ప్రభుత్వం వైద్య శిబిరం నిర్వహిస్తుందని తెలుసుకొని ఇక్కడికి వచ్చా. బీపీని పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చారు. పేరు నమోదు చేసుకున్నారు. మందులు అయిపోయిన తరువాత మరోసారి ఉచితంగానే ఇస్తామని చెప్పారు. ఇలాంటి వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయి.

– రామలక్ష్మీ, వన్‌టౌన్, కర్నూలు



కర్నూలులో షుగర్ పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, మేయర్ బీవై రామయ్య



కర్నూలులోని ఉర్దూ ఘర్‌వద్ద ఉన్న యూపీహెచ్‌సీలో జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించి వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

మంచి చేస్తున్న ప్రభుత్వం మళ్లీ రావాలి

- టీడీపీ విష ప్రచారాన్ని తిప్పి కొట్టండి
- జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న చల్లా మధుసూదన్ రెడ్డి



హాజరైన పార్టీ నాయకులు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వం మళ్లీ వచ్చే విధంగా సైనికుల్లా పనిచేయాలని జేసీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జేసీఎస్ మండల, క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లో గెలుపు సాధించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అందుకు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక చేసిన, చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. అనంతరం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పి.రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య మాట్లాడుతూ.. జేసీఎస్‌లు ప్రతి ఇంటి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో హామీలు అమలు చేయకుండా టీడీపీ మోసం చేసిందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో విజయం సాధించి సీఎంకు కానుకగా ఇవ్వాలన్నారు. సమావేశంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు గోకుల్‌రెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, వెన్నపూస రవీందర్ రెడ్డి, మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు వర్క్‌షాప్



హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్, హెచ్‌ఆర్‌సీ చైర్మన్ సీతారామమూర్తితో జిల్లా న్యాయమూర్తులు

కర్నూలు (లీగల్): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కోర్టులో న్యాయమూర్తులకు శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ నేతృత్వంలో నోడల్ అధికారి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ సీతారామమూర్తి, విశ్రాంత న్యాయమూర్తి లక్ష్మీనరసింహారెడ్డి సివిల్ కేసులో డాక్యుమెంటరీ ఎవిడెన్స్ గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసరావు , అదనపు జిల్లా జడ్జీలు, సబ్ జడ్జీలు, జూనియర్ సివిల్ జడ్జీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్వామా శిక్షణ కేంద్రంలో రేపు గాంధీ జయంతి వేడుకలు

కర్నూలు(అగ్రికల్చర్): జగన్నాథగట్టులోని జిల్లా నీటియాజమాన్య సంస్థ శిక్షణ కేంద్రంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వంద మందికిపైగా రక్తదానం చేయనున్నారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అన్ని అంశాల్లో అద్భుత పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు కలెక్టర్ సృజన చేతుల మీదుగా అందజేయనున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు ప్లానింగ్ ప్రక్రియను చేపట్టే కార్యక్రమాన్ని అక్టోబరు నెల 2న శ్రీకారం చుట్టనున్నారు.

బ్యాంక్ ఖాతాల్లో నగదు మాయం

- ఆధార్ ఈ కేవైసీ హ్యాక్ చేసిన సైబర్ కేటుగాళ్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

కోడుమూరు రూరల్: ఆధార్ ఈ కేవైసీని హ్యాక్ చేసి సైబర్ కేటుగాళ్లు అనుమానం రాకుండా విడతల వారీగా బ్యాంక్ ఖాతాల్లో నగదును కాజేస్తున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కొద్ది రోజుల క్రితం స్థలాల రిజిస్ట్రేషన్ కోసం కోడుమూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో వినోద్‌కుమార్, ఫారూక్, హుస్సేన్, నందకుమార్, మధు తదితరులు ఆధార్ ఈ కేవైసీ చేశారు. అయితే రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే కాకుండా కొన్ని రోజుల తర్వాత వినోద్‌కుమార్ ఖాతా నుంచి మూడు విడతల్లో రూ.17వేలు డ్రా చేశారు. అలాగే ఫారూక్, హుస్సేన్, నందకుమార్, మధు ఖాతాల నుంచి కూడా రూ. 8వేల నుంచి రూ. 20వేల వరకు నగదును విడతల వారీగా సైబర్ కేటుగాళ్లు డ్రా చేసుకున్నారు. బాధితులు స్థానిక ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుకు వెళ్లగా ఆధార్ ఈ కేవైసీ ద్వారా నగదును మహారాష్ట్రలోని థానేలో డ్రా చేశారని చెప్పారు. దీంతో కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులును ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించి సైబర్ క్రైమ్ పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా.. ఆధార్ ఈకైవేసి హ్యాక్ అయిన ఘటనపై కోడుమూరు సబ్‌రిజిస్ట్రార్ అధికారులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జ్‌గా రాఘవరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జ్‌గా జీవీ రాఘవరెడ్డిని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. కడపకు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది జీవీ రాఘవరెడ్డిని కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లా జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల పట్టణ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు.

వృద్ధాప్యంలో ఆదరణ

అరవై ఏళ్లు పైబడిన వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఓపీ సేవలు
- అవసరమైన పరీక్షలు, మందులు, చికిత్స ఉచితం
- జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 10,79,764 మందికి చికిత్స
- వృద్ధుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరి జీవితంలో వృద్ధాప్యం సహజం. అప్పటి వరకు జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న వారు జీవిత చరమాంకంలో సుఖంగా జీవించాలని కోరుకుంటారు. ఇందుకోసం చాలా మంది ప్రణాళికలు రూపొందించుకుంటారు. మరికొందరు కుటుంబ సభ్యులపై ఆధారపడి జీవిస్తుంటారు. అయితే కొందరి విషయంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కొరవడుతోంది. వృద్ధాప్యంలో పెద్దల పట్ల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అసలే వృద్ధాప్యం.. పైగా వ్యాధులు వెంట వచ్చిన జీవితం కావడంతో జీవిత చరమాంకంలో పోరాటం తప్పని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం ఆసరా కల్పిస్తోంది. వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు చేయిస్తూ మందులు అందజేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం 2011లో మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో భాగంగా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ హెల్త్ కేర్ ఆఫ్ ఎల్డర్లీ(ఎన్‌పీహెచ్‌సీఈ)ని రూపొందించింది. ఈ కార్యక్రమం రాష్ట్రంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అమలు కాలేదు. పెద్దలపై ఉన్న గౌరవంతో ప్రస్తుత ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సీహెచ్‌సీ, యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రి, బోధనాసుపత్రుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ మేరకు వృద్ధులకు



వృద్ధునికి వైద్యపరీక్ష చేస్తున్న సిబ్బంది

చాలా చోట్ల ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేక వార్డు, ఓపీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో గత ఏప్రిల్ నుంచి ఆగస్టు నెల వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 60 ఏళ్లకు పైబడిన వారు 10,79,764 మంది చికిత్స పొందారు. వారికి ఆయా కేంద్రాల్లో అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. స్పెషలిస్టు వైద్యులచే చికిత్స చేయించడంతో పాటు అవసరమైన వారికి ఫిజియోథెరపీ కూడా చేయించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలోనూ వృద్ధులను వారి ఇంటి వద్దకే వెళ్లి చూస్తున్నారు.

ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు చికిత్సలు ఇలా..

మాసం	ఏరియా ఆసుపత్రి	సీహెచ్‌సీ	పీహెచ్‌సీ	యుపీహెచ్‌సీ	మొత్తం
ఏప్రిల్	6279	3,753	45,349	13,040	68,421
మే	12,558	7,506	89,390	26,080	1,35,534
జూన్	25,116	15,012	1,77,896	52,111	2,70,135
జులై	50,232	29,986	3,55,663	1,04,211	5,40,092
ఆగస్టు	6,143	3,635	42,972	12,832	65,582
మొత్తం	1,00,328	59,892	7,11,270	2,08,274	10,79,764

వృద్ధుల ఆరోగ్యమే ధ్యేయంగా కార్యక్రమాలు



వృద్ధుల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 60 ఏళ్లు పైబడిన వారి కోసం ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నారు. వారికి స్పెషలిస్టు వైద్యులచే చికిత్స, అవసరమైన మందులు, ఫిజియోథెరపీ అందుతున్నాయి. వయోవృద్ధులు ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మీ ఆరోగ్యపరిస్థితి చెప్పి చికిత్స తీసుకోవాలి.

– హేమలత, ఎన్‌సీడీ జిల్లా అధికారి, కర్నూలు

నిర్లక్ష్యం చేయకూడదు



ఇంట్లో వృద్ధులను నిర్లక్ష్యం చేయకూడదు. వారిని కనిపెట్టుకుని ఉండాలి. వారు తరచూ కింద పడే అవకాశం ఉంది. దీనివల్ల తుంటి ఎముక విరగడం, తలకు గాయం కావడం జరుగుతాయి. తరచూ బీపీ, షుగర్, గుండెజబ్బులు, కంటి పరీక్షలు చేయిస్తూ ఉండాలి. వారి చెప్పేది జాగ్రత్తగా విని ఆచరించాలి. వృద్ధాప్యంలో సమస్యలు రాకుండా ఉండాలంటే రోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలి.

– డాక్టర్ పి.రవికళాధర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం నూతన కమిటీ

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా వైద్య విభాగం నూతన కమిటీ ఏర్పాటైంది. పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 35 మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ప్రకటన విడుదల చేసింది.

జిల్లా అధ్యక్షుడు: డాక్టర్ ఓ.ఎం.కృష్ణమూర్తి(ఆదోని నియోజకవర్గం)

ఉపాధ్యక్షులు: డాక్టర్ కేఎస్ రఘు (ఎమ్మిగనూరు), డాక్టర్ రెహనా అలీ ఖాన్ (కర్నూలు)

ప్రధాన కార్యదర్శులు: డాక్టర్ శేఖర్(ఆలూరు), డాక్టర్ భాస్కర్(మంత్రాలయం), డాక్టర్ పి.సతీష్(పాణ్యం), డాక్టర్ సి.శ్రీకాంత్(కర్నూలు), డాక్టర్ మోహన్ కృష్ణ(ఎమ్మిగనూరు), డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్(ఆదోని)

కార్యదర్శులు: డాక్టర్ పి.నీలకంఠేశ్వర్(పత్తికొండ), డాక్టర్ ఎస్.వీరాంజనేయులు(ఆలూరు), డాక్టర్ హనుమంత్‌రెడ్డి(ఆలూరు), డాక్టర్ కె.గోవింద్ రాజ్(ఆదోని), డాక్టర్ షేక్ అల్తాఫ్ హుసేన్(ఆదోని), డాక్టర్ ఎస్.అమీర్ ఖాన్(మంత్రాలయం), డాక్టర్ హుసేన్ పీరా(మంత్రాలయం), డాక్టర్ నాగలక్ష్మీ రెడ్డి(కర్నూలు), డాక్టర్ ఎస్.వి.గిరివర్ధన్ రెడ్డి(కర్నూలు), డాక్టర్ ఎం.శ్రీకాంత్(పాణ్యం), డాక్టర్ ఎస్.లక్ష్మీరెడ్డి(పాణ్యం), డాక్టర్ విష్ణు శాంతి(ఎమ్మిగనూరు), డాక్టర్ కె.కార్తీక్(ఎమ్మిగనూరు)

సంయుక్త కార్యదర్శులు: డాక్టర్ జె.రఘునాథ్‌రెడ్డి(పత్తికొండ), డాక్టర్ రంగారెడ్డి(పత్తికొండ), డాక్టర్ జి.శ్రీనివాసులు(ఆలూరు), డాక్టర్ సుగ్రీవుడు(ఆలూరు), డాక్టర్ విక్రమసింహా రెడ్డి(పాణ్యం), డాక్టర్ నిరంజన్‌రెడ్డి(పాణ్యం), డాక్టర్ వినయ్‌కుమార్(ఆదోని), ఎం.అబ్దుల్ ఖాలిక్(ఆదోని), డాక్టర్ నబీ రసూల్(మంత్రాలయం), డాక్టర్ ఎస్.మాలిక్ బాషా(కర్నూలు), డాక్టర్ మణివర్ధన్ రెడ్డి(కర్నూలు), డాక్టర్ మనోజ్(ఎమ్మిగనూరు), డాక్టర్ మాల కొండయ్య(ఎమ్మిగనూరు).

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన అవసరం

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. ఆగస్టు 29 నుంచి ప్రారంభమైన నంద్యాల జిల్లా పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. స్థానిక జిల్లాపరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో జరిగిన ముగింపు కార్యక్రమాలకు హాజరైన జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థలు సొంత ఆదాయ వనరులను ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై తాను కూడా ఎస్ఐఆర్‌డీలో శిక్షణ పొందానన్నారు. శిక్షణా కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో అమలుపరచాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఈ వ్యవస్థ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఎంపీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నవరత్నాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో సచివాలయ సిబ్బంది పారదర్శకతతో పనిచేయాలన్నారు. నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో శిక్షణ పర్యవేక్షకులు వెంకటరత్నం, డీపీఆర్‌సీ జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, రాజవర్ధన్, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

14,15 తేదీల్లో ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్ష

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఐజీ

కర్నూలు: రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్‌ఐ ఉద్యోగాల నియామక ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షల్లో 8,347 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షను ఈ నెల 14, 15 తేదీలలో నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలను శనివారం రాత్రి కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల, సిస్టర్ స్టాన్సిలాస్ మెమోరియల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్, రైల్వే స్టేషన్ రోడ్డులోని కేవీఆర్ ప్రభుత్వ కాలేజీ ఫర్ ఉమెన్, కోట్ల సర్కిల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాలను డీఐజీ పరిశీలించారు. పెద్దటేకూరు శివారులో ఉన్న బృందావన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ, దూపాడు సమీపంలోని అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల, కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నంద్యాల రోడ్డులోని రాయలసీమ యూనివర్సిటీ, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, నందికొట్కూరు రోడ్డులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల, రవీంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ కేంద్రాలను ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. ఎస్‌ఐ పరీక్షల ఏర్పాట్లపై ఆయా కళాశాల యాజమాన్యాలతో మాట్లాడారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, తాలూకా సీఐ శ్రీరామ్, కర్నూలు తాలూకా రూరల్ సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాయలసీమ యూనివర్సిటీ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్



కేవీఆర్ కళాశాల అధ్యాపక బృందంతో మాట్లాడుతున్న డీఐజీ సెంథిల్ కుమార్

ఏసీబీ వలలో కోటేకల్ వీఆర్వో

- లంచం తీసుకుంటూ పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్

ఎమ్మిగనూరురూరల్: కోటేకల్ వీఆర్వో శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు శనివారం సాయంత్రం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాలు.. కోటేకల్ గ్రామానికి చెందిన తెలుగు జయరాముడు తన పొలం వాల్యుయేషన్ సర్టిఫికెట్ కోసం 15 రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. సర్టిఫికెట్ ఇవ్వడానికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు లంచం ఇవ్వాలని వీఆర్వో శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అయితే రూ.1,500 చొప్పున ఇస్తానని రైతు తెలుగు జయరాముడు ఒప్పంద కుదుర్చుకుని ఏసీబీ అధికారులకు సమాచారం చేరవేశాడు. శనివారం సాయంత్రం ఏసీబీ డీఎస్పీ, ఐదుగురు సీఐలు పక్కా ప్రణాళికతో ఎమ్మిగనూరు పట్టణ శివారులో వీఆర్వో శ్రీనివాసులు రూ. 1500, అలాగే తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులకు రూ. 1500 లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం ఇవ్వాలని డిమాండ్ చేస్తే 14400 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వీఆర్వో శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు

నేడు అన్ని పంచాయతీల్లో 'స్వచ్ఛతాహి సేవా'

- కోడుమూరులో హాజరు కానున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నేడు (ఆదివారం) జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 'స్వచ్ఛతాహి సేవా' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ' ఏక్ తారీఖ్ .. ఏక్ గంట .. ఏక్ సాత్ ' పేరుతో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కోడుమూరు గ్రామ పంచాయతీ సమీపంలోని సంత మార్కెట్ పరిసరాల్లో నిర్వహించనున్న శ్రమదాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జే సుధాకర్ పాల్గొననున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో రెండు ప్రాంతాలను ఎంపిక చేసుకొని శ్రమదానం నిర్వహించాల్సి ఉందన్నారు. ఆయా గ్రామాల్లో కనీసం వంద మంది ప్రజలను సమీకరించి సమష్టిగా శ్రమదానం చేయాలన్నారు. గ్రామ ముఖ ద్వారాలు, మార్కెట్ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రార్థనా మందిరాలు.. తదితర ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సర్పంచు, పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీ, క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. చెత్త, చెదారాలను సమీపంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు తరలించేందుకు వీలుగా పారకలు, ట్రైసైకిల్స్, ఇతర పారిశుద్ధ్య పనిముట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేందుకు జిల్లాలోని ఎంపీడీఓ, డీఎల్‌పీఓలు చర్యలు చేపట్టాలన్నారు. శ్రమదానికి సంబంధించి కనీసం పది ఫొటోలు తీసి సిటిజన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

నేడు, రేపు వాటర్‌షెడ్ గ్రామాల్లో..

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు 1,2 తేదీల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. శకునాల, పోతుగల్, కందనాతి, బాపురం గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంపచెట్లు తొలగించడం, పరిసరాలను పరిశుభ్రం చేయడం వంటి పనులు చేపడతామని పేర్కొన్నారు. 2న గాంధీ జయంతి వేడుకలు నిర్వహించడంతో పాటు వాటర్ షెడ్ కమిటీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు మొక్కలు నాటుతారని తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయము, కర్నూలు

ఆర్.ఓ.సి.నెం.112/2022, తేది: 30/09/2023

బహిరంగ వేలము నోటీసు

వ్యవసాయ మార్కెట్ కమిటీ, కర్నూలు మార్కెట్ యార్డు వెలుపల నిర్మించిన దుకాణ సముదాయములకు తేది: 10-10-2023 మధ్యాహ్నం 3.00 గంటలకు మార్కెట్ యార్డు నందు బహిరంగ వేలము నిర్వహించబడును. కావున ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలము నందు పాల్గొనుటకై సంబంధిత వివరాలకై మార్కెట్ కార్యాలయము నందు అన్ని పనిదినములలో సంప్రదించగలరు.

సం/- కె.గోవిందు, ఎంపిక శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి, కర్నూలు

3 నుంచి బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో 16 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేశామని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు రెగ్యులర్ 3,157 మంది, సప్లిమెంటరీ 916 మంది విద్యార్థులు రాయనున్నట్లు చెప్పారు.

కాన్వొకేషన్ దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో నాల్గో కాన్వొకేషన్ దరఖాస్తు గడువును ఈ నెల 5వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఇంత వరకు దరఖాస్తు చేయని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల నుంచి స్వీకరించిన అభ్యర్థనల దృష్ట్యా గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి పోర్టల్‌లో వివరాలు

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థుల వివరాలు నేటి నుంచి స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో ఎంపికైన విద్యార్థుల వివరాలు అక్షరం కూడా తప్పు లేకుండా పోర్టల్‌లో ఈ నెల 30లోపు నమోదు చేయాలన్నారు. వివరాలను ఈ ఏడాది డిసెంబర్ 15లోపు క్షుణ్ణంగా పరిశీలించి, స్కూల్ నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా ధృవీకరించాలన్నారు. విద్యార్థులు డిసెంబర్ 30లోపు జిల్లా నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా అప్లికేషన్‌ను సరిచూసుకోవాలన్నారు. అదేవిధంగా 2019, 2020, 2021,2022 సంవత్సరాల్లో ఎంపికైన ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం రెన్యూవల్ చేసుకోవాలని డీఈఓ సూచించారు.